# అమ్మ

సృష్టిలో అమ్మ అంత గొప్పది మరొకటి లేదు. ప్రాణులన్నింటిలోనూ అమ్మే గొప్పది.

ప్రాణుల్లో మంచివీ చెడ్డవీ ఉన్నాయి. మనుషుల్లో మంచివాళ్లూ చెడ్డవాళ్లూ ఉన్నారు. అమ్మల్లో మాత్రం ఆ తేడా లేదు. అమ్మలందరూ మంచివాళ్లే.



స్త్రీకి సహనశీలి అనే పేరుంది. కానీ, సహనం లేని స్త్రీలున్నారు. సహనం లేని అమ్మలు మాత్రం లేరు.

బిడ్డను కడుపులో తొమ్మిది నెలలూ మోయడం దగ్గరనుంచి కనీ పెంచీ పెద్ద చేసేదాకా అమ్మ చూపే ప్రేమ, ఓరిమి అంతా ఇంతా కాదు. అందుకే భూమిని తల్లితో పోల్చారు.

స్త్రీ ద్వేషులుండవచ్చు కానీ, అమ్మ ద్వేషులు అరుదు.

బిడ్డ సన్మార్గుడైనా దుర్మార్గుడైనా తల్లి అతని క్షేమం కోరుకుంటుంది. దుర్మార్గుడినయితే, సన్మార్గంలో పెట్టే ప్రయత్నమూ చేస్తుంది.

ఏదయినా కష్టం వస్తే అమ్మనే తలుచుకుంటాం. ఏదయినా దెబ్బ తగిలిగితే వెంటనే 'అమ్మా' అంటాం. దేవుణ్ని తలుచుకోని వాళ్లు ఉండొచ్చు కానీ, అమ్మను తలుచుకోని వాళ్లు ఉండరు. అందువల్లే, దేవుడే లేడనే మనిషున్నాడు. అమ్మే లేదనువాడు అసలే లేడు అనే పాట పుట్టింది.

అమ్మ మీద ఎన్నో పాటలున్నాయి. కథలున్నాయి. కవితలున్నాయి. గోర్కీ నవల అమ్మ ప్రపంచ ప్రసిద్ధి పొందింది. బైబిల్ తర్వాత ఎక్కువ ప్రతులు అమ్ముడుపోయింది అమ్మ నవల ఒక్కటే. ఆ విధంగా క్రీస్తు తర్వాతి స్థానం అమ్మదే. అయితే క్రీస్తు అమ్మ మరియ...!

గోర్కీ 'అమ్మ'లో ఒక విశిష్టత వుంది. సాధారణంగా అమ్మలందరూ తమ బిడ్డల బాగోగుల గురించే ఆలోచిస్తారు. గోర్కీ అమ్మ ఆ పరిధిని దాటింది.

తాగుబోతు భర్తవల్ల పేదరికపు కష్టాలను భరించిన ఆ అమ్మ, కొడుకు పావెల్ కోసం కష్టాలను సంతోషంగా భరించింది. నలుగురి మేలుకోసం పాటుపడుతున్న కొడుక్కి అండగా నిలిచింది. కొడుకు స్నేహితుల్ని తన బిడ్డలుగా చూసుకుంది. జార్జి చక్రవర్తికి వ్యతిరేకంగా పోరాడుతున్న పావెల్‌ను చూసుకుని గర్వించింది. తనూ రహస్యంగా కరపత్రాలను పంచింది. ఆ ప్రజా ఉద్యమంలో పాల్గొంది. కొడుకుమీది ప్రేమను ప్రజల మీద చూపింది. ఆవిధంగా గోర్కీ అమ్మ విశ్వజనీనతను సంతరించుకుంది.

కుటుంబ పరిధినుంచి తన ప్రేమనూ, వ్యక్తిత్వాన్నీ విశాలం చేసుకుంది. అయితే ఈ స్థాయికి చేరడానికి ఆమెకు బిడ్డమీద ప్రేమకూడా కారణం.

గోర్కీ 'అమ్మ' స్థాయికి చేరడం అందరి అమ్మలకూ సాధ్యం కాదు.

అందరి అమ్మల్లోనూ కొందరు అమ్మలు బిడ్డలకోసం తమ జీవితాల్నే త్యాగం చేసిన వాళ్లున్నారు.

ఒకమ్మ అయితే, పదేళ్ల వయసులోనే కోమాలోకి వెళ్లిపోయిన బిడ్డను ఆమె జీవితాంతమూ సాకింది. కోమాలో దశాబ్దాల తరబడి ఉండిపోయిన ఆ బిడ్డ పోవాలనుకోలేదు. ఆమెకు అన్నీ తనే అయింది. మానవత్వానికీ మాతృ హృదయానికీ పరాకాష్ఠగా నిలిచింది.

వికలాంగులైన బిడ్డల్నీ మానసిక వికలాంగులైన పిల్లల్నీ ప్రేమతో సాకే సహనశీలురైన అమ్మలు ఉన్నారు. కానీ పుత్ర ప్రేమను దాటి, తోటి స్త్రీల పక్షం వహించిన ఓ అమ్మ ఇటీవల కనిపించింది. ఈ అమ్మే కనుక సత్యం శంకరమంచి బతికుండగా కనిపిస్తే మరో అమరావతి కథ అయ్యేది.

అమరావతిలో ఇటీవల కొందరు స్త్రీలను వివస్త్రలను చేశారు. అందుకు కారణం ముఠా తగాదాలేనని వార్తలొచ్చాయి. ఒక కుటుంబంలోని స్త్రీలను వివస్త్రలను చేసి వీధిలో వేధిస్తుంటే ఆ ఊరి ప్రజలు చూస్తూ మౌనంగా ఉండిపోయారట. అప్పుడొక అమ్మ ఆ స్త్రీల పక్షం వహించిందట.

"కక్షలుంటే మీ మగాళ్లూ మగాళ్లూ చూసుకోండి. తన్నుకు చావండి. అంతేకానీ మధ్యలో ఆడవాళ్ల నెందుకు బలి చేస్తారు. ఆడాళ్లను అవమానిస్తే ఆ ఉసురు తప్పక తగులుతుంది" అంటూ తన ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. ఆ మహిళల్ని వాళ్లింటికి చేర్చింది. అప్పుడామెకు తన కొడుకు గుర్తుకురాలేదా? లేకపోతే ఆ ఉసురు తన కొడుక్కి తగలకూడదనుకుందా?

ఇంతకీ ఆ అమ్మ స్త్రీలను వివస్త్రలను చేయించడానికి కారకుడని అంతా అనుకుంటున్న ఆ ఊరి సర్పంచ్ తల్లి!

అమ్మలందర్నీ మించిన ఈ అమ్మకు పాదాభివందనాలు.

2.8.93

ఆంధ్రభూమి దినపత్రిక